క్లుప్తంగా

వేతనాల చెల్లింపునకు వినతి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



సమ్మెనోటీసు అందజేస్తున్న నాయకులు

పెద్దేముల్: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. బుధవారం పెద్దేముల్ ఎంపీడీఓ జర్నప్పకు సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులతో ఉదయం, రాత్రి సమయాల్లో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు ఉన్నారు.

ఆకతాయిల కట్టడికి అభ్యర్థన

కొడంగల్ రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కొడంగల్ డివిజన్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ ఆధ్వర్యంలో బుధవారం ఏఎస్ఐ శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. రహదారి వద్ద ప్రత్యేకంగా షీ టీంను ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరించాలని కోరారు. కళాశాల సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఆకతాయిలను కట్టడి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కొడంగల్ ఇన్‌చార్జి జిల్లా కమిటీ సభ్యుడు రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను కలిసిన నేతలు

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ గ్రామశివారులో ఉన్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు పీఎఫ్‌తో పాటు గ్రాడ్యువిటి చెల్లించడంలో సీసీఐ యజమాన్యం జాప్యం చేస్తోందన్నారు. సీసీఐ యజమాన్యంతో చేసుకున్న ఒప్పందాన్ని తుంగలో తొక్కుతుందని కమిషనర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. లిఖితపూర్వకంగా వివరాలిస్తే.. కంపెనీ యజమాన్యంతో మాట్లాడి వడ్డీతో సహా గ్రాడ్యువిటి డబ్బులు ఇప్పిస్తామని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రాఘవేంద్రనాయక్ కార్మిక సంఘం నాయకులకు భరోసా ఇచ్చారు. అలాగే, కార్మికులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో నాయకులు శరణప్ప, మాధవ్, రాములు, శంకర్, రమేష్, నబీలు ఉన్నారు.

వివక్ష చూపుతున్నారు..

దౌల్తాబాద్: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో పీర్లపండుగలో దళితులకు, ఇతర సామాజికవర్గానికి గొడవ జరిగింది. ఈ క్రమంలో అప్పట్లో ఇరువర్గాల వారు దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అయితే, గొడవ జరిగిన నాటి నుంచి గ్రామంలో తమపై సామాజిక వివక్ష చూపుతున్నారని బుధవారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన, బాధితులు ఆంజనేయులు ఉన్నారు.

పంట వివరాలు సక్రమంగా ఉండాలి

వ్యవసాయశాఖ అధికారి వసంత



మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ వసంత

మర్పల్లి: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలు సక్రమంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి వసంత, ఏఈఓ ప్రశాంత్ సూచించారు. పంటసాగు వివరాల్లో ఏవైన తేడాలు ఉంటే ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఇబ్బందిగా మారుతుందన్నారు. బుధవారం పట్లూర్ రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని పట్లూర్, అల్లాపూర్ గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, పెసర, మినుము, కంది, సోయాబీన్ పంట పొలాలను పరిశీలించారు. పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంట వివరాలు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

బడులకు నో కరెంట్ బిల్

- ప్రభుత్వ నిర్ణయంతో మేలు
- నిర్వహణ నిధులు ఇతర పనులకు వాడుకునే వెసులుబాటు



దేవర్‌ఫసల్‌వాద్ ప్రాథమికోన్నత పాఠశాల

దౌల్తాబాద్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలకు కూడా వర్తిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బడుల నిర్వహణకు వచ్చే నిధులు ఎక్కువగా విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకే సరిపోతుంటాయి. ఒక్కోసారి నిధులు సమయానికి రాకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో ఉండేవి. దీంతో బకాయిలు పేరుకుపోయి హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉచిత విద్యుత్‌తో ఎలాంటి ఇబ్బందులు ఉండవని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొద్దిపాటి నిధులు

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు ప్రతి సంవత్సరం రూ.10వేల నుంచి రూ.75వేల వరకు చెల్లిస్తుంది. అయితే, ప్రాథమిక పాఠశాలలకు రూ.25వేల వరకు వస్తుంటాయి. ఇవి కూడా రెండు దఫాలుగా చెల్లిస్తుండడంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు పడేవారు. వీటితోనే స్టేషనరీ, జాతీయ పండుగల నిర్వహణ, ఇంటర్‌నెట్ బిల్లులలు, చిన్న చిన్న మరమత్తులు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ, విద్యుత్తు బిల్లులు, తాగునీటి నిర్వహణకు ఖర్చు చేయాలి.

వినియోగం ఎక్కువే..

మండలంలో 8 ఉన్నత, 8 ప్రాథమికోన్నత, 30 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటికి కేటగిరి–7ఏ కింద విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. ప్రాథమిక బడులకు ప్రతి నెలా సుమారు రూ.300, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.500 వస్తుంటాయి. ఇక ఉన్నత పాఠశాలలకు పది తరగతి గదులు వరండాలు ఉంటాయి. వీటన్నింటికీ బల్బులు, ఫ్యాన్లు ఉంటాయి. దీనికి తోడు బోరు ఉంటుంది. దీనికి నెలకు రూ.800వరకు బిల్లు వస్తుంది. మన ఊరు–మన బడి పథకంలో ఎంపికైన పాఠశాలలకు ఇంటాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు కూడా అందజేశారు. వీటన్నింటి వినియోగంతో విద్యుత్తు బిల్లులు ప్రతి నెల పెరుగుతూనే ఉన్నాయి.

కొన్నేళ్లుగా డిమాండ్

పాఠశాలలకు ప్రభుత్వమే ఉచితంగా విద్యుత్తు అందించాలని డిమాండ్ ఉంది. ఉపాధ్యాయ సంఘాలు ఎన్నోసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఉచిత విద్యుత్తు అందిస్తామని ప్రకటించడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇతర అవసరాలకు వినియోగం

ప్రభుత్వం నిర్ణయంతో బడుల ఆర్థిక భారం తగ్గనుంది. కరెంటు బిల్లుల చెల్లింపు లేకపోవడంతో కొంత సొమ్ము మిగులుతోంది. నిర్వహణ నిధులను ఇతర అవసరాలకు ఉపయోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. –రాజు, హెచ్‌ఎం, బాలంపేట

అర్చకుల సంక్షేమానికి కృషి

జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, సహాయ కార్యదర్శి రాఘవేందర్‌రావు



జిల్లా ప్రధాన కార్యదర్శి కరణం శ్రీకాంత్‌రావు



సహాయకార్యదర్శి రాఘవేందర్‌రావు

దోమ : దూపదీప నైవేద్య అర్చకులకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి కరణం శ్రీకాంత్‌రావు, సహాయ కార్యదర్శి రాఘవేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ.. మంగళవారం కొడంగల్‌లో జరిగిన దూపదీప కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర నేతలు తమపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. జిల్లాలోని అర్చకులకు అండగా ఉంటామన్నారు. రాష్ట్ర కార్యవర్గ ఆదేశాలతో నియమ నిబంధనలను పాటిస్తూ అర్చకుల గౌరవ మర్యాదలను కాపాడుతామన్నారు.

ఏజీపీకి సన్మానం



బాలముకుందంను సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: పరిగి సివిల్ కోర్టు ఏజీపీగా నియమితులైన కుల్కచర్ల గ్రామానికి చెందిన సీనియర్ అడ్వకేట్ బాలముకుందంను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కుల్కచర్లకు బాలముకుందం ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా నియమితులయ్యారు. బుధవారం పరిగి బార్ అసోసియేషన్ కార్యాలయంలో మండలం కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ తన సహచరులతో బాలముకుందంను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ న్యాయవాదులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విఠల్, వెంకట్రాములు, మొగులయ్య, కృష్ణ, శ్రీను, వెంకట్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో 100కి డయల్ చేయండి

ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పూడూరు: అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను వినియోగించుకుని ఆపద నుంచి బయటపడాలని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాడల్‌స్కూల్ బాలికల వసతి గృహంలో ఆన్‌లైన్ మోసాలు, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. వాట్సాప్‌ల్లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, పోలీసు సిబ్బంది నిరంజన్, శివకుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగానికే .. సేవలకు కాదు

ఎంఈఓ గోపాల్

నవాబుపేట: బదిలీలు కేవలం ప్రాంతాలకే, సేవలకు కాదని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. మండలంలోని పులుమామిడి ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు నవీన, కొత్తగా వచ్చిన హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయురాలు పూలమ్మకు సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో బదిలీలు సర్వసాధారణమన్నారు. ఎక్కడికి వెళ్లామన్నది ముఖ్యం కాదు. మన వల్ల పిల్లలకు మేలు జరిగిందనేదే చూడాలన్నారు. ఎక్కడ పని చేసినా గుర్తింపు సంపాదించుకోవాలన్నారు. అప్పుడే ఉద్యోగ జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాను ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ విజయ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరం

చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్



వారోత్సవాల్లో పాల్గొన్న స్వప్న, నీరజ

తాండూరు టౌన్ : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అన్నారు. బుధవారం పట్టణంలోని సాయిపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు ఎంతో స్వచ్ఛమైనవని, బయట పాలు బిడ్డకు పట్టించడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని, అవి పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీరజాబాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం

దుద్యాల్: బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. బుధవారం దుద్యాల్, లగచెర్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలు మొదటగా తాగించాలి. పాలు ఇవ్వడం వల్ల తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్వాడీ టీచర్లు ఎఎన్ఎం రాములమ్మ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ముర్రుపాలు తాగించాలి

కొడంగల్ రరల్ : తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని, పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని తహసీల్దార్ విజయకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రుద్రారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిడ్డ పుట్టినప్పటి నుంచి 6నెలల వరకు తల్లిపాలనే పట్టించాలన్నారు. తర్వాత బిడ్డకు ఆహారం ఇవ్వడం మొదలు పెట్టాలన్నారు. బాలింతలు రెండు సంవత్సరాల పాటు బిడ్డకు పాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దాశమ్మ, నాయకులు అంబయ్యగౌడ్, ఖాసింసాబ్, గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి జన్మదినం

కొడంగల్ రూరల్ : పేదల తిరుపతిగా పేరుగాంచిన మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో బుధవారం గోదాదేవి జయంతి ఉత్సవాలను ఆలయ ధర్మకర్తలు, పురోహితులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం అమ్మవారి ఆస్థాన మండపంలో తిరుచ్చిపై వేంచేపు చేశారు. దేవస్థానం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించారు.



విశేష అలంకరణలో గోదాదేవి

సమస్యలపై నిరంతర పోరాటం



తాండూరు రూరల్: సభ్యత్వ నమోదులో నేతలు



పరిగిలో సభ్యత్వ నమోదు

తాండూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సిరిగిరిపేట్, చెంగోల్, గౌతపూర్ ప్రభుత్వ పాఠశాల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పీఆర్టీయూ సభ్యత్వం నమోదు చేయించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాం నర్సింహారెడ్డి, నాగప్ప, కిష్టప్ప, మధుసూదన్‌రెడ్డి, హుస్సేన్, నరేందర్, రాజేశ్వర్, భానులు ఉన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి

పరిగి: ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ ఫిట్మెంట్, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని చిట్యాల తదితర పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో ఎలాంటి సమస్యలు ఉన్న పోరాటం చేసి సాధించేది కేవలం పీఆర్టీయూ ఒక్కటే నన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర సంఘం బాధ్యులు నర్సింహులు, బుగ్గయ్య, శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

- కల్తీ పదార్థాలను వినియోగించొద్దు
- ఫుడ్ సేఫ్టీ శిక్షణ తీసుకోవాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు టౌన్ : శుచి, శుభ్రత గల పదార్థాలను విక్రయించి కస్టమర్ల ఆరోగ్యానికి రక్షణగా నిలవాలని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ అన్నారు. బుధవారం ఫాస్టాక్ ఫుడ్ సేఫ్టీ శిక్షణా సంస్థ వారు స్థానిక విలియంమూన్ పాఠశాలలో పలు ఆహార పదార్థాల విక్రయ దుకాణ యజమానులతో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పానీపూరి షాపుల్లోకి నిత్యం వందలాది మంది ప్రజలు వస్తుంటారని, వారికి శుభ్రమైన పదార్థాలను అందజేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కల్తీ పదార్థాలను వినియోగించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడొద్దన్నారు. ఫుడ్‌సేఫ్టీ విషయంలో పాటించే నియమ నిబంధనలపై ఫాస్టాక్ ఫుడ్‌సేఫ్టీ శిక్షణా సంస్థ వారు అందిస్తున్న ట్రైనింగ్ తీసుకుని సర్టిఫికెట్ పొందాలన్నారు. దీనివల్ల శుభత్ర, నాణ్యత వంటి అంశాలపై యజమానులకు అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, ఫాస్టాక్ కెవీజివిఎం పాన్‌ఇండియా లెవల్ ట్రైనింగ్ పార్ట్‌నర్ సౌతిండియా ఇన్‌చార్జి సింధు, మోహన్‌బాబు, జనార్దన్, ట్రైనర్ యశోదాదేవి, నిర్వాహకురాలు సునీత, పలు బేకరీ, స్వీట్ హౌజ్, హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బదిలీలు సహజం

కుల్కచర్ల: ఉపాధ్యాయ వృత్తిలో బదిలీలు సర్వసాధారణమని ఎంఈఓ హబీబ్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. అత్యుత్తమంగా బోధన చేసే ఉపాధ్యాయులు ఎక్కడికెళ్లినా గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, సీఆర్పీ రాజు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఖాళీల భర్తీకి ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్లో వంట మనిషి, వంట అసిస్టెంట్, నైట్‌వాచ్‌మెన్ (మహిళ) పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వంట మనిషి పోస్టుకు పదో తరగతి, అసిస్టెంట్ ఏడో తరగతి ,నైట్ వాచ్‌మెన్ పదోతరగతి చదివి ఉండాలని సూచించారు. నైట్ వైచ్‌మెన్ మాత్రం మహిళ ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీలోపు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్వచ్ఛదనంతోనే ఆరోగ్యం

డీపీఎల్ఓ శంకర్‌నాయక్



టేకులగడ్డతండాలో నీటి ట్యాంకును శుభ్రం చేయిస్తున్న డీపీఎల్ఓ శంకర్‌నాయక్

బొంరాస్‌పేట: స్వచ్ఛమైన పరిసరాలే ఆరోగ్యానికి మూలమని జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి (డీపీఎల్ఓ) శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని టేకులగడ్డతండాలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. రోడ్డు పక్కన ఉన్న గుంతలను మట్టి పూడ్చివేయించారు. స్వచ్ఛదనం–పచ్చదనం పనులను వెంటనే పూర్తి చేయాలని గ్రామ ప్రత్యేకాధికారికి సూచించారు. ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఇందులో హెచ్‌ఎం గోపాల్, గ్రామాధికారి శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి, ఆయా బుజ్జిబాయి, ఎమర్జెన్సీ వర్కర్ జెమినీబాయి ఉన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛదనం–పచ్చదనం

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం మూడవ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాలను ఎంపీడీఓ విజయలక్ష్మి పరిశీలించారు. గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షించాలన్నారు. పరిశుభ్రతతో స్వచ్ఛ గ్రామాలుగా మార్చేందుకు యువకులు బాధ్యతగా పని చేయాలన్నారు.

వ్యాధులపై అప్రమత్తత

మోమిన్‌పేట: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి సూచించారు. బుధవారం మండలంలోని మేకవనంపల్లిలో 'స్వచ్ఛదనం.. పచ్చదనం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ర్యాలీ నిర్వహించి, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇంటింటికి వెళ్లి జ్వరం వచ్చిన వారిని గుర్తించి మాత్రలు ఇవ్వాలన్నారు. మంచి నీటి ట్యాంకులను 15రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని పేర్కొన్నారు. ఆయన వెంట కార్యదర్శి జగన్నాథ్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లుఉ, ఏఎన్ఎంలు ఉన్నారు.

పచ్చదనం పెంపొందేందుకు కృషి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని చౌడాపూర్ జెడ్పీ పాఠశాల, విఠలాపూర్, వీరాపూర్ గ్రామాల్లో పర్యటించి స్వచ్ఛదనం–పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ.. విద్యార్థులు తమ పాఠశాల పరిధిలో మొక్కలు నాటడంతో పాటు ఇళ్ల దగ్గర కూడా నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి, ఇతరలకు కూడా సూచించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, స్థానిక ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



తాండూరు రూరల్: పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

తాండూరు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్మికులు నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోనూర్ గ్రామంలో స్వచ్ఛదనం–పచ్చదనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అన్నీ గ్రామాల్లో మురు గుకాల్వల్లోని మురుగును తొలగించాలన్నారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. వనమహోత్సంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రశీద్ ఉన్నారు.

శ్రావణమాస యజ్ఞం

తాండూరు టౌన్ : శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్యసమాజ్‌లో భక్తులు యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ ప్రమోదిని రెడ్డి పాల్గొని పూజలు, యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత భావన కలిగి ఉండాలన్నారు. భక్తిభావంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. శ్రావణమాసంలో చేసే పూజలు నేరుగా భగవంతుడికి చేరుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ శోభారాణి, శకుంతల, అశోక్, ఆర్యసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

దోమ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సూర్యనారాయణచారి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ప్రజలకు, వాహనదారులకు సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీసులు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్ నేరాల బాధితులు పెరిగిపోతున్నారని అన్నారు. గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుసుకోవాలన్నారు.

ఆర్మీ జవాన్‌ల సేవలు వెలకట్టలేనివి

కుల్కచర్ల: నాలుగు రోజుల క్రితం కేరళ రాష్ట్రం వయనాడ్‌లో వరదలు సంభవించి ప్రజలు అతలాకుతలం అయిన ఘటనలో ఆర్మీ జవాన్ రాజ్‌కుమార్ ప్రజలను రక్షించడంలో కీలకంగా వ్యవహరించారు. బుధవారం స్వగ్రామానికి వచ్చిన అతనికి పీఎస్‌పీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు జోగు వెంకటయ్య, రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. యువత జాతీయభావాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రజలను రక్షించేందుకు బ్రిడ్జి నిర్మాణంలో సహచర ఆర్మీ జవాన్లతో కలిసి కాపాడిన తీరు సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మైపాల్, బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంతు, ముదిరాజ్ మండల అధ్యక్షుడు చంద్రలింగం, నాయకులు రఘు, రవిలాల్, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

గర్భగుడి ద్వారం ప్రతిష్ఠాపన

కొడంగల్ రూరల్ : పట్టణ శివారులో అయ్యప్ప స్వామివారి ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆలయ గర్భగుడి ముఖ ద్వారం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రజలు ఘనంగా నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చి గ్రామానికి చెందిన శిల్ప కళాకారుడు శేఖర్ సబర్‌మణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేస్తూ ద్వార ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ మెంబర్స్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, ఉమాపతిగౌడ్, పప్పుడాగా, శ్రీనివాస్‌గౌడ్, నర్సిరెడ్డి, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.



స్వామివారి గర్భగుడి ద్వార ప్రతిష్ఠాపన